ప్రజాశక్తి

గురువారం 8 మే 2025 5 శ్రీ సత్యసాయి

మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీసత్యసాయి విమానాశ్రయంలో మాక్‌డ్రిల్

పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉగ్రవాదులు దాడులు చేస్తే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి.. వారిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై భద్రతపరంగా బుధవారం శ్రీ సత్యసాయి విమానాశ్రయంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు కలెక్టర్ టిఎస్.చేతన్ ఎస్పీ వి.రత్నలు పుట్టపర్తి విమానాశ్రయంలో జరిగిన మాక్ డ్రిల్‌ను పరివేక్షించారు. డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయంలో ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి.. రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. దాడులకు పాల్పడితే ఆ సమయంలో ఎలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి, వివిఐపిలకు ఎలాంటి రక్షణ కల్పించాలి.. ప్రమాదం జరిగిన వెంటనే వారిని అంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కు ఎలా తరలించాలి.. బాంబులు అమర్చిన ప్రాంతాన్ని డాగ్స్ స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలనే విషయాలపై మార్క్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ కళ్యాణ్, సిఐలు, సునీత, సురేష్, ఆర్ఐలు మహేష్, వలి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సిఎం చంద్రబాబు ఈ నెల 9వ తేదీ పుట్టపర్తి విమానాశ్రయానికి రానున్న సందర్భంగా పటిష్టమైన భద్రత చేపట్టాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం ఎస్పీ రత్నతో కలిసి సత్యసాయి విమానాశ్రయాన్ని సందర్శించారు. చంద్రబాబు 9వ తేదీ ఉదయం 10:50 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి బయల్దేరి పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారన్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉరవకొండ నియోజకవర్గానికి బయల్దేరి వెళ్తారన్నారు. విమానాశ్రయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పోలీస్ శాఖ, ఆర్ అండ్ బి, అగ్నిమాపక శాఖ, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. సిఎం వచ్చి తిరిగి వెళ్లే వరకూ పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. విమానాశ్రయం అధికారులకు అన్ని శాఖల అధికారులు సహకారం అందించాలన్నారు. వారి వెంట పుట్టపర్తి ఆర్‌డిఓ సువర్ణ, విమానాశ్రయం అధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తరేషన్‌కార్డులకు దరఖాస్తులు

◆ సచివాలయాల్లో తీసుకునేలా ఏర్పాట్లు

◆ కొత్త వాటికి ఈ నెల 31 వరకు గడువు

◆ డిజిటల్ ఏటీఎం తరహాలో రేషన్ కార్డు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కొత్త తరహా రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది ప్రస్తుతం కలర్ ఫోటోలతో ఉన్న రేషన్ కార్డులు ఉన్నాయి. ఇకనుంచి వాటిని డిజిటల్ రూపంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టింది క్యూఆర్ కోడ్ కలిగి ఏటీఎం కార్డు తరహాలో రేషన్ కార్డు రూపొందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఉన్న పాత పద్ధతిలో కాకుండా కొత్త తరహాలో రేషన్ కార్డు రానుంది. బుధవారం నుంచే కొత్త కార్డు దరఖాస్తులకు అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మే 31 లోపు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. జీఎస్టీడబ్ల్యూఎస్ ఫార్మెట్లో ఈ దరఖాస్తు అందజేయాల్సి ఉంటుంది.

కొత్త రేషన్ కార్డులు కోసం జిల్లా ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు కొత్త వాటి కోసం అనుమతినిచ్చింది. ఈసారి ఇచ్చే కార్డులు కూడా పాత వాటిలాగా కాకుండా మార్పులు చేయాలని చూస్తోంది. స్మార్ట్ కార్డు తరహాలో కొత్త రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. క్యూఆర్ కోడ్ కలిగిన ఏటీఎం తరహాలో ఉన్న రేషన్ కార్డులను మంజూరు చేయనున్నట్టు సమాచారం. అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 6,67,289 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 53,050 కార్డులు ఉన్నాయి. ఎన్ఎఫ్ఎస్ఎ కార్డులు 5,54,310 ఉన్నాయి. ఇతరులు 59,908 కార్డులు ఉన్నాయి.

కొత్త కార్డులు, మార్పులు.. చేర్పులు

ప్రభుత్వం ఇప్పుడు ఇవ్వబోతున్న రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు కూడా అవకాశం కల్పించింది. ఏడు రకాల సేవలను ఇప్పుడు లబ్ధిదారులు వినియోగించుకోవచ్చు కొత్త రేషన్ కార్డు, అదనంగా చేర్పులు, కార్డ్ స్ప్లిట్టింగ్, కార్డును సరెండర్, అదనంగా సభ్యుల చేర్పు, అడ్రస్ మార్పు, ఈకెవైసి సదుపాయాలను కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులను ఆయా సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి తీసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

మృతి చెందిన నాన్నమ్మ ఇద్దరు చిన్నారులు

కన్నీటి శోకం..!

◆ నీటమునిగి అక్కాతమ్ముడు మృతి

◆ కాపాడబోయిన నానమ్మ కూడా..

◆ యల్లనూరు మండలం కల్లూరులో విషాదం

నానమ్మతో కలిసి సంతోషంగా ఇంటి నుంచి వెళ్లిన వారికి అదే చివరి రోజు అయ్యింది. అక్కాతమ్ముడు ఇద్దరూ ఆడుతూ పాడుతూ నానమ్మతో కబుర్లు చెప్తూ ముందుకు సాగారు. ఆ మాటలే వారికి ఆఖరి మాటలు అయ్యాయి. నిమిషాల వ్యవధిలో సంతోషం ఆవిరైంది. అనుకోని ప్రమాదం చిన్నారులిద్దరినీ బలిగొంది. కళ్లేదుటే నీటిలో కొట్టుకుపోతున్న తన వారసులను కాపాడుకునే ప్రయత్నంలో ఆ వృద్ధురాలు కూడా నీటమునిగి తుదిశ్వాస విడిచింది. ఆనందంగా వెళ్లిన వారి ఇంట గంటల వ్యవధిలోని కన్నీటి శోకం మిగిల్చింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లలిద్దరూ అనుకోని ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోధించారు. యల్లనూరు మండలం కల్లూరు గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

యల్లనూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన డి.శ్రీనివాసులు, డి.ప్రశాంతి దంపతులకు లిడియా(12), జాషువా(9) సంతానం. సెలవులు కావడంతో వీరిద్దరూ వారి నాన్నమ్మ నాగలక్ష్మమ్మ ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం బట్టలు ఉతికేందుకు నాగలక్ష్మమ్మ చిన్నారులు ఇద్దరితో కలిసి వెళ్లింది. ప్రమాదవశాత్తు ముగ్గురు కాలువలో పడి మరణించారు.

ప్రజాశక్తి-యల్లనూరు

వార్త మెయిన్‌లో

భారత సైన్యానికి సంపూర్ణ మద్దతు : రఘువీరా

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిగా భారత భద్రతా దళాలు 'ఆపరేషన్ సిందూర' పేరుతో ఉగ్రవాదుల శిబిరాలపై విజయవంతంగా దాడులు చేయడం పట్ల బుధవారం సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మన భద్రతా దళాలు ఉగ్రవాదుల శిబిరాలు, ఉగ్రవాదులను మట్టు పెట్టాలని కోరారు. భారత్ సైన్యం ధైర్య సాహసాలను మెచ్చుకోవడంతోపాటు సైన్యానికి సంపూర్ణ మద్దతు తెలిపారు.

పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా క్రాంతికుమార్..!

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా క్రాంతికుమార్‌ను నియమించినట్లు సమాచారం. కోఆపరేటివ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ ప్రహ్లాదను కదిరికి బదిలీ అయ్యారు.

అభిప్రాయం చెప్పినా వేధింపులా..?

◆ పహల్గాం బాధిత మహిళలపై సోషల్ మీడియాలో ట్రోల్స్ దుర్మార్గం

◆ బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలి

◆ రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డా॥ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం

గత నెల 22వ తేదీన కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద దాడిలో ఆత్మీయులను కోల్పోయిన హిమాన్షీ నర్వాల్, ఆరతి మీనన్‌లు ఘటనపై బాధ్యతతో కూడిన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా వారిపై సోషల్ మీడియాలో వికత పోస్టులు చేయడం అత్యంత దుర్మార్గమని పలు మహిళా సంఘాల నాయకులు అభిప్రాయ పడ్డారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో బుధవారం నాడు అనంతపురం ఎన్జీవో హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెవివి నాయకులు డాక్టర్ ప్రసూన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. పెళ్లయిన పది రోజులకే భర్తను కోల్పోయిన హిమాన్షీ, తండ్రిని పోగొట్టుకున్న ఆరతిపై కనీస మానవత్వం లేకుండా సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని ఆమె తెలిపారు. ఇలాంటి వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారతీయ మహిళగా బాధ్యతతో కూడిన అభిప్రాయాల్ని వ్యక్తం చేయడం వారు చేసిన నేరంగా ఈ ట్రోల్స్ జరుగుతున్నాయన్నారు. ఉగ్రవాదుల్ని కఠినంగా శిక్షించాలని, చంపిన వారి మతాన్ని బట్టి ఆ మతస్థులను హింసించవద్దని చెప్పిన హిమాన్షిని అభినందించాల్సింది పోయి అతి ఘోరంగా వేధిస్తున్నారని తెలిపారు. ఆమె ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లోకి చొరబడి ఆమె వ్యక్తిగత జీవితాన్ని దుర్భాషలాడుతున్నారని విమర్శించారు. జాతీయ మహిళా హక్కుల కమిషన్ స్పందించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి వారిని అరికట్టడంలో ఎందుకు చర్య తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఐద్వా నాయకురాలు సావిత్రి మాట్లాడుతూ మహిళలకూ సొంత అభిప్రాయాలు ఉంటాయని, వాటిని గౌరవించాలని మహిళా కమిషన్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మత ఉన్మాదులు మహిళలను గౌరవించలేరని ఈ సంఘటనలు మరోసారి రుజువు చేస్తున్నాయన్నారు. కాశ్మీర్లో స్థానిక ముస్లిములు తమకు చేసిన సహాయాన్ని చెప్పిన ఉగ్రవాద బాధిత కుటుంబాలపై సామాజిక మాధ్యమాల్లో వేధించడాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. మహిళల శరీర భాగాలను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఈ మూకలు వారి ఫేస్ బుక్ పేజీలను దేవుని ఫోటోలు, భరతమాత ఫోటోలతో నడపడాన్ని హిందూ మత పెద్దలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని కోరారు. భారత ప్రభుత్వం ఉగ్రవాద శిబిరాలపై చేస్తున్న ఆపరేషన్ సిందూరకు మహిళలు నాయకత్వం వహిస్తుండడం గర్వకారణం అన్నారు. సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ ధైర్యసాహసాలకు, దేశంలోని మతసామరస్యానికి ప్రతీకలని కొనియాడారు. మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పద్మావతి మాట్లాడుతూ భారతదేశ ఐక్య దేశం అని చెప్పారు. భారతీయులంతా ఒక్కటిగా ఉంటారని చెప్పారు. బిజెపి ఆర్ఎస్ఎస్ వ్యక్తులు ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి విద్వేషాలు రగిలితే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు శేకన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, నాయకులు వి.రామిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు జిలాన్, ఆవాజ్ నాయకులు వలి, ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి-హిందూపురం

సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న చట్టాలపై కార్మికులు మరింత అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లునాయక్ సూచించారు. కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఆటోనగర్‌లో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జడ్జి మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించడంతో పాటు కచ్చితంగా భద్రత ఉండేలా చూసుకోవాల న్నారు. ప్రతి కార్మికుడు ఆదాయ వనరులకు అనుగుణంగా బీమా సౌకర్యం పొందితే భవిష్యత్తులో ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. న్యాయవాది రవిచంద్ర మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం పూర్తిగా యాజమాన్యాలపైనే ఉంటుందన్నారు. పనిచేసే ప్రాంతాల్లో కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేనిచో కార్మికులు నేరుగా న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. ఆర్థిక ఆదాయం తక్కువగా ఉన్న వర్గాలకు న్యాయస్థానాలు ఉచిత న్యాయ సహాయం అందజేస్తాయని తెలిపారు. సామాజిక, వ్యక్తిగత సమస్యలను మండల న్యాయ సేవా సంస్థ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించు కోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మురళి, మనోహర్, గురునాథ్, దివ్య, అంజనమ్మ, లోక్ అదాలత్ సిబ్బంది శారద, ఆటోనగర్ యూనియన్ ప్రతినిధులు అంజాద్, హసీబ్, నూర్, హఫీజ్, సమీవుల్లా, వెంకటేష్, నాసిర్ అహ్మద్, సతీష్, అజ్మతుల్లా పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు అండగా ఉంటామని, వారి అన్ని సమస్యలను పరిష్కరి స్తామని ఛైర్మన్ రమేష్ కుమార్ భరోసా ఇచ్చారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పారిశుధ్య కార్మికులు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, మున్సి పల్ కమిషనర్ ఛాంబర్ ముందు ధర్నా చేపట్టారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ స్థానికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేదన్నారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. వీటిపై మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ సంఘం శ్రీనివాసులుకు సమ్మె నోటీసు ఇచ్చారు. స్పందించిన ఛైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్మికుల సమస్యలను పరిష్క రించాలని తమను ఆదేశించారన్నారు. రాష్ట్ర స్థాయిలో సమస్యలను డిఎంఎ కార్యాలయానికి సూచించా రన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, రామచంద్ర, రంగనాథ్, గురునాథ్, కవిత, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎఐటియుసి ఆద్వర్యంలో మున్సిపల్ కార్మికులు కమిషనర్ ఛాంబర్ ముందు ఆందోళన చేసి కమిషనర్‌కు వినతి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-మడకశిర



ప్రజలతో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజు

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల పట్టాలు, తదితర విషయాలపై ప్రజలు వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, గణేష్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కౌన్సిలర్లు సుభద్ర నాగేంద్ర, మేఘన రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యమందించాలి

గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే రాజు ఆదేశించారు. రొళ్ల మండలంలోని జిజి హట్టి గ్రామంలో అతిసారతో బాలిక మృతి చెందినట్లు దినపత్రికల్లో వార్తలు రావడంలో బుధవారం ఆయన గ్రామంలో పర్యటించారు. ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో అన్ని చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ మంజువాణి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బి.ఎస్ గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, ఎంపీడీవో రామారావు, తహశీల్దార్ షెక్షావలి, మండల ప్రధాన కార్యదర్శి జికే ఈరన్న, బాలకృష్ణ, హేమంత్ కుమార్, డాక్టర్లు, అధికారులు ఉన్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కొత్త రేషన్‌కార్డు కోసం సంబంధిత సచివాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 16,89,531 రేషన్ కార్డులు ఉన్నాయని, ఇప్పటికే రేషన్ కార్డు కలిగి ఉండి, కొత్త సభ్యుల చేర్పులు, పాతవారిని తొలగింపు, చిరునామా మార్పు చేసుకోవచ్చన్నారు. కార్డు లేని వారు కొత్తగా తీసుకోవచ్చన్నారు.

రొద్దం : అర్హులందరూ రేషన్ కార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రేషన్ కార్డులో దాదాపు 7 రకాల సేవలంది స్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రొద్దంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిఎస్‌డబ్ల్యుఎస్ ప్లాట్‌ఫామ్‌లో ప్రస్తుతం ఉన్న ఏడు రైస్ కార్డ్ సంబంధిత సేవలు ప్రారంభించామని, ఆయా సేవలను అవసరమైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

లేపాక్షి : నూతన రేషన్‌కార్డు కోసం ప్రజలు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని బుధవారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రేషన్‌కార్డుకు సంబంధించిన వివిధ సమస్యలపై కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.

'పురం'లో మౌలిక వసతుల కల్పనకు

రూ. 92.5 కోట్లు విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలను కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 92.5 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వుల ప్రతిని బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం విడుదల చేసింది. దీంతో బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్‌కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ నేతృత్వంలో టిడిపి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఛైర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రజల ఇబ్బందులు తీర్చాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు విడుదల చేయించారని తెలిపారు. ఈ నిధులతో పట్టణ వ్యాప్తంగా మురికి కాలువలు, రహదారులు, వీధి దీపాల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు డైమండ్ బాబా, నెట్టప్ప, దుర్గా నవీన్, అజ్మత్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిన జిఓను చూపిస్తున్న బాలయ్య పిఎ బాలాజి, ఛైర్మన్ రమేష్‌కుమార్

'పిఎం సూర్య ఘర్' లక్ష్యాన్ని చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'పిఎం సూర్య ఘర్' లక్ష్యాన్ని జిల్లాలో పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పంచాయతీ, ఉపాధి పనులు, సూర్య ఘర్ పథకాలపై కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా 65వేల దరఖాస్తులు స్వీకరించాలని, అందుకు తగిన ప్రణాళికలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం రూ. 60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 55 వేలు సబ్సిడీగా వంద శాతం ఉచితంగా అందుతుందన్నారు. వారి అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందిస్తే యూనిట్‌కు రూ. 2.90 చెల్లిస్తుందన్నారు. బిసిలకు కేంద్రం రూ. 60 వేలు, రాష్ట్రం రూ. 20 వేలు అందిస్తుందని, లబ్ధిదారులు రూ. 35 వేలు బ్యాంకు ద్వారా రుణం పొంది ఐదేళ్ల కాల పరిమితిలో తిరిగి చెల్లించవచ్చన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ఇళ్ల కప్పులపై సోలార్ ప్యానల్ ఏర్పాటుకు 40 శాతం రాయితీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, సోలార్ అధికారి వివేక్, డిపిఒ సమత, డ్వామా పిడి విజయేంద్రప్రసాద్, సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలకు కొత్త మోటార్లు ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

కరువు నిధుల కింద అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి పథకాలకు నూతన మోటార్లు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని నింకంపల్లి రోడ్డు, మున్సిపల్ శారదా పాఠశాల వద్ద పలు తాగునీటి పథకాలకు ఏర్పాటుచేసిన కొత్త మోటార్లను బుధవారం చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. వేసవి దృష్ట్యా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా అన్ని వార్డుల్లో తాగునీటి పథకాలకు కొత్త మోటార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా నీటి సమస్య రాకుండా ప్రణాళిక ప్రకారం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే నీటి సరఫరాతో పాటు అదనంగా మోటార్ల ద్వారా కూడా ప్రజలకు

బోరు బావిని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

నీరు సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అయూబ్, ఇన్‌ఛార్జి డీఈఈ ఆనందరాజు, ఏఈ జనార్ధన్, టీడీపీ నాయకులు ఆంజనేయులు, డైమండ్ బాబా, ఆదినారాయణ, గోపాల్, ఇందాద్, ఫిట్టర్లు శంకర్, భగవంతప్ప పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ

పుట్టపర్తి క్రైమ్ : విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థుల కోసం విజయవాడలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు బి.వినోద్ తెలిపారు. దృష్టి, వినికిడి లోపం, ఆర్థోపెటిక్, తదితర వారికి ఎస్‌జిటి ఉపాధ్యాయ పోస్టులకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కనీసం 40 శాతం వికలత్వం ఉన్నవారు అర్హులన్నారు. టెట్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. శిక్షణ, స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి కల్పిస్తారన్నారు.

దాడితోటలో కార్డెన్ సెర్చ్

తాడిమర్రి : మండలంలోని దాడితోట గ్రామంలో బుధవారం ముదిగుబ్బ రూరల్ సిఐ శ్యామ్‌రావు, తాడిమర్రి ఎస్ఐ కృష్ణవేణి పోలీస్ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్ భద్రత, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

ఆటోనగర్‌లో ఖాళీ స్థలాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి-హిందూపురం

ఆటోనగర్‌లో ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని షెడ్ల నిర్మాణం చేపడుతున్నారని, అడ్డుకోబోతే దాడి చేశారని ఆటో నగర్ అసోసియేషన్ అధ్యక్షులు అంజాద్ తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆటోనగర్ లో ఉన్న కార్మికులు వారి షాపులను బంద్ చేసి టూ టౌన్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కొందరు వారికి కేటాయించిన స్థలంలో కాకుండా వేరే స్థలంలో కూడా నిర్మాణాలు చేస్తున్నారు. దీనిని అడ్డుకోబోతే దాడులు

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి ఇస్తున్న ఆటో నగర్ కార్మికులు

చేశారన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆటోనగర్‌లో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ది హిందూపూర్ ఆటో వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నూర్, ఫయాజ్, ముస్తఫా, ఉస్మాన్, బాబ్‌జాన్, ఆజాద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో టెండర్లు

ధర్మవరం రూరల్ : ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. షాపులకు ఐదేళ్ల గడువుతో వ్యాపార నిర్వహణకు అనుమతి ఉంటుందన్నారు. వివరాలకు 9959225859, 6303151302, 7382861410, 7382860501కు ఫోన్ చేయాలన్నారు.

కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ధర్మవరం రూరల్ : పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని యువజన ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. పదో తరగతిలో 500, ఇంటర్‌లో 900కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఐఐటి(ఇంజినీరింగ్), నీట్(ఎంబిబిఎస్)లో సీట్లు సాధించిన విద్యార్థులు, గ్రూప్-1, 2, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తామని తెలిపారు. వివరాలకు 99083 87330, 94918 67165, 94408 08732లో సంప్రదించాలన్నారు.

కల్పవృక్ష, హనుమ వాహనాలపై ఊరేగిన చెన్నకేశవస్వామి

ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో 4వ రోజైన బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమ వాహనంపై చెన్నకేశవస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహన ఉభయదాతలుగా సత్యనారాయణ, బండారు శ్రీనివా సులు, దాసరి నిరంజన్‌కుమార్‌యాదవ్, గాండ్ల రామాంజనేయులు, దాశెట్టి నారాయణస్వామి, లక్ష్మీనరసమ్మ, చిన్నరామయ్య, రాచర్ల మునెయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. సాయంత్రం హనుమ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ దాతలుగా బండి వేణుగోపాల్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వారిని చైర్మన్ శాలువాతో సత్కరించారు. అనంతరం స్వామి వారిని పట్టణ పురవీధుల గుండా ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పుల్లయ్య శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, చక్రధర్, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

వనభోజనాలకు ఊరేగింపుగా వెళ్తున్న సభ్యులు

నల్లమాడలో వనభోజనాలు

నల్లమాడ : నల్లమాడ గ్రామ కోమటి సేవా సంఘం సభ్యులు బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనాలకు వెళ్లారు. ముందుగా డ్రమ్స్‌తో ఊరేగింపుతో ఊరి చివరికు చేరుకున్నారు. అక్కడే ఆహారం తయారు చేసి భోజనం చేశారు. రోజంతా ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. సాయంత్రం మళ్లీ గ్రామంలోకి చేరుకున్నారు. కార్యక్రమంలో కోమటి సేవా సంఘం నాయకులు గోపాలయ్య, ఆనంద్, శ్రీనివాసులు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, శ్రీధర్, సుబ్బి, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం

ప్రజాశక్తి-హిందూపురం

బహుజనులకు రాజ్యాధికారం దక్కాలంటే బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతంకుమార్ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన బహుజన సంకల్ప సభకు గౌతం కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి రైల్వే రోడ్డు మీదుగా అంబేద్కర్ భవన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. సభలో గౌతం మాట్లాడుతూ బిసి కుల గణన చేపట్టాలని మాయావతి నాయకత్వంలో జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావడంతోనే కేంద్రం ఆమోదించిందని, ఇది బీఎస్పీ విజయంగా అభివర్ణించారు. పూలే, అంబేద్కర్, కాన్షీరాం కలలు కన్న, కోరుకొన్న రాజ్యాధికారం మనం వేసే ఓటుతోనే, అది కూడా బీఎస్పీ ఏనుగు గుర్తుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో గోవిందు, ఇర్ఫాన్, నాగరాజు, నాజీమ్ బాషా, రామాంజనేయులు, పెన్నయ్య, హనుమంతు, రాజేంద్రప్రసాద్, వినయ్ కుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

పాడి విత్తనాలతో రైతులకు అనేక లాభాలు

బుక్కపట్నం : వర్షాకాలం ముందు పాడి విత్తనాలు దుక్కిలోకి చల్లడం వల్ల రైతులు అనేక లాభాలు పొందవచ్చని ఎడి సనావుల్లా తెలిపారు. మండలంలోని మారాల గ్రామంలో బుధవారం ప్రీ మాన్‌సూన్, డ్రై షోయింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎడి మాట్లాడుతూ వర్షాకాలం ముందు రైతులు తమ పొలాల్లో దుక్కిలో ఐదు రకాల ప్రధాన పంటలతో పాటు 20 రకాల వివిధ పంట గింజలను కలిపి చల్లాలన్నారు. తొలకరి వర్షం కురిసిన వెంటనే విత్తనాలు మొలకెత్తడంతో పాటు సూక్ష్మజీవులు పెరగడం, నేల తేమగా ఉండడం, ఆరోగ్యంగా ఉండడంతో రైతులకు ఆదాయం ఉంటుందని తెలిపారు. మట్టి నమూనా సేకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్‌బాబు, ఆర్‌ఎస్‌కె సిబ్బంది బాబు, రైతులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల పరిశీలన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బుధవారం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు పరిశీలించారు. ఆయన మండల అధికా రులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ గత పాలకుల కాలంలో అక్రమంగా కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను న్యాయపూర్వకంగా తిరిగి స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాల కోసం వినియో గించాలని కోరారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. తాగునీటి కోసం ఆసుపత్రిలో బోర్ అవసరమని వైద్య సిబ్బంది కోరగా ఆయన వెంటనే ఫోన్ ద్వారా ఎంపీడీవోతో మాట్లాడారు. నాలుగు రోజుల్లో బోరు పనులు పూర్తి చేసి తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు మాలపాటి రామకృష్ణ, అంజన్‌రెడ్డి, గడ్డం ఓబిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, దాము, రాజు, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన హరీష్‌బాబు

పిఎం సూర్య ఘర్ స్కీంపై సమావేశం

ధర్మవరం రూరల్ : పిఎం సూర్య ఘర్ స్కీంపై బుధవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఎలక్ట్రికల్ డీఈలు, బ్యాంక్ మేనేజర్లు, తహశీల్దార్లు సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మహేష్ మాట్లాడుతూ స్కీంలోని ముఖ్యాంశాలు, గవర్నమెంట్ ద్వారా కలిగే సదుపాయాలు, సబ్సిడీల గురించి వివరించారు. సోలార్ ప్యానల్స్ ఇంటి పైకప్పుపై అమర్చడం వల్ల పర్యావరణం కాలుష్యాన్ని తగ్గించడంలో మన వంతు బాధ్యత ఉంటుందని గుర్తు చేశారు. రాబోయే కాలంలో కేవలం గ్రీన్ ఎనర్జీ మాత్రమే వాడకంలో ఉండవచ్చని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్లు నటరాజ్, భాస్కర్‌రెడ్డి, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

కాంగ్రెస్ పార్టీని గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకూ బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేష్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి) విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేసి, ఆ సంస్థను కాపాడాలని కోరారు. లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని తెలిపారు. అలాగే పహల్గామ్ మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదులను ఏరి వేయాలని ప్రధాని మోడీని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, పతి, రాజు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే

ముదిగుబ్బ : మండలంలోని దొరిగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా కేతిరెడ్డికి అర్చకులు వేదమంత్రాలతో హారతి ఇచ్చారు. కేతిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కృపతో వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. అంతకుముందు గ్రామస్తులు కేతిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, మీసేవా చంద్ర, దొరిగల్లు చంద్ర, క్వార్టర్స్ అంజి, గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డి, మహేష్, లోకేశ్వర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరి

వర్ధంతి సభలో కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ టిఎస్.చేతన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు డిఆర్ఒ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఏఓ వెంకటనారాయణ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేకమైన అధ్యాయమన్నారు. స్వాతంత్రం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి అమరుడయ్యారన్నారు. ఆయన ధైర్యం, తెగువ సాటి లేనివన్నారు. అలాంటి మహనీయుల త్యాగ ఫలితమే నేడు స్వాతంత్ర్య దేశంలో స్వేచ్ఛగా బతుకుతున్నామన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి ప్రతాపరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, డిపిఆర్ఒ వేళాయుధం తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య చరిత్రలో మహోజ్వలశక్తి అల్లూరి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వలశక్తి అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ వి.రత్న కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమైందన్నారు. పరిమిత వనరులతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన పోరాటయోధుడన్నారు. మన్యం ప్రజల హక్కులు, స్వాతంత్ర్యం కోసం పోరాడి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేశారన్నారు. ఆ వీరుడి స్ఫూర్తి భారతీయ యువతకు చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు మహేష్, వలి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, ఎఆర్ పోలీస్, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు

అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్, సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రత్న

ఆర్‌డిటికి అండగా ఉందాం : కేతిరెడ్డి

ప్రజాశక్తి-బత్తలపల్లి

బడుగు, బలహీన వర్గాలు, పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి)కు అందరూ అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని, ఇందుకు అన్ని వర్గాల ప్రజలు నడుం బిగించాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌డిటి ఆసుపత్రి వద్ద ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద నిర్వహించిన సేవ్ ఆర్‌డిటి కార్యక్రమంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు అనేక జిల్లాల్లో ఆర్‌డిటి వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తుందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌సిఎ సేవలు నిలిపివేయడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని కోరారు. భారత సైన్యం ఉగ్రవాదులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర

విన్సెంట్ ఫెర్రర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి

విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన ఫాదర్ ఫెర్రకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, యోగానందాచారి, కోటి సురేష్, కోటి నరేష్, నడిమింటి షాషావలి, బండి వీరనారప్ప, కరీం సాబ్, రాంభూపాల్‌రెడ్డి, కాశప్ప, పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్

పావగడ : కెపిఎస్‌సి, యుపిఎస్‌సి పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కర్నాటక ఆర్య వైశ్య మహాసభ డైరెక్టర్, తాలూకా ప్రతినిధి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నాటక ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాసవీ అకాడమీ ద్వారా ఉచితంగా కోచింగ్‌తో పాటు వసతి కల్పిస్తామని తెలిపారు. ముందుగా అభ్యర్థులు వాసవీ అకాడమీ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులు కావాలన్నారు. 2026లో యుపిఎస్‌సి పరీక్ష రాయాలనుకునే విద్యార్థుల కోసం బెంగళూరులో విజయనగర వీధిలో కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

ఓబుళదేవరచెరువు : వాల్మీకి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, టిడిపి నాయకురాలు నాగవేణి బుధవారం ఒడిసిలో మిట్టపల్లి క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు బాగా సాధన చేసి భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో రాణించాలని సూచించారు.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన వేడుకలు

పుట్టపర్తి రూరల్ : మండలంలోని మామిళ్లకుంట క్రాస్ సమీపంలో వెలసిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆల యంలో బుధవారం ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గోపాలాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం, భక్తి గేయాలను ఆలపించారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రూరల్ మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మారుతి గత జనవరిలో ఓ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మారుతి కొన్నేళ్లుగా టిడిపి కార్యకర్తగా ఉన్నారు. పార్టీ సభ్యత్వం కూడా ఉంది. స్థానిక నాయకుల ద్వారా ఈ విషయాలు తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ బుధవారం ఆ గ్రామం వెళ్లి మారుతి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే మారుతి భార్యకు మంజూరైన రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ టిడిపిలో సభ్యత్వం అంటే ఆ కుటుంబానికి ఒక భరోసా అన్నారు. కేవలం రూ. వంద చెల్లించి సభ్యత్వం పొందితే ఏదైనా ప్రమాదంలో వ్యక్తి మృతి చెందితే ఆ కుటుంబానికి రూ. 5 లక్షలు అందుతుందన్నారు.

మారుతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీరామ్

ఒక రాజకీయ పార్టీలో కార్యకర్తలకు ఇన్సూరెన్స్ చేయించాలని మంత్రి నారా లోకేష్ చేసిన ఆలోచన ఇప్పుడు ఎన్నో కుటుంబాలను ఆదుకుంటోందన్నారు. మారుతి కుటుంబానికి టిడిపి ఎప్పటికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మహేష్‌చౌదరి, తాతిరెడ్డి, నాయకులు ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

కొత్తచెరువు : కొత్తచెరువు సమీపంలోని పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్డీవో సువర్ణ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు ఆర్డినరీ ట్రైన్ భోగీల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, పోలీసులు పాల్గొన్నారు.

శక్తి టీమ్‌లో భాగస్వాములవ్వాలి

ప్రజాశక్తి-లేపాక్షి

మహిళల రక్షణలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి టీంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్ఐ నరేంద్ర సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన శక్తి టీం, డ్రగ్స్ నిర్మూలన, పోక్సో కేసుల గురించి వివరించారు. ప్రతి గ్రామంలో శక్తి టీం ఏర్పాటు చేయాలన్నారు. చిన్నపిల్లల మిస్సింగ్, బాల్యవివాహాల నిర్మూలన, వంకలు, వాగులు, చెరువుల్లో పిడి చిన్నపిల్లలు మరణించడం, చిన్నపిల్లలపై జరిగే అత్యాచారాలు, భౌతిక దాడులు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఆయా

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేంద్ర

విషయాలపై అంగన్వాడీ కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ధనమ్మ, మాధవి, భాగ్యమ్మ, పార్వతమ్మ, రూపా, అంగన్వాడీ కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

నాటుసారాను అరికడతాం

పుట్టపర్తి రూరల్ : నాటుసారా, మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపడతామని ఎక్సైజ్ సిఐ నాగరాజు తెలిపారు. బుక్కపట్నం మండలంలోని నార్సింపల్లితండా సమీపంలో నాటుసారా తయారీ కేంద్రాలపై గత నెల 12వ తేదీ దాడులు చేయగా పారిపోయిన నార్సింపల్లి తండాకు చెందిన కె.శ్రీరాములు నాయక్‌ను బుధవారం అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఇదివరకే పాత ముద్దాయిలు, అనుమానితులు 27 మందిని గుర్తించి సంబంధిత తహశీల్దార్‌ల వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ బిల్లులు రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలుపుతూ బుధవారం మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు కదిరి కమిటీ యూనియన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి తిరుపాలు, జనార్ధన, బాలకృష్ణ, చెన్నకృష్ణ, గంగప్ప, నరసింహమూర్తి, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్‌అలీ, గంగాధర్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతుల తనిఖీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని బాబుజగ్జీవన్‌రామ్ నగర్‌లో ఉన్న ప్రధాన గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను బుధవారం గ్రంథాలయ ముఖ్య కార్యదర్శి రమ తనిఖీ చేశారు. ఆమె మాట్లా డుతూ ఉచిత శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజూ అనుకూల సమయంలో గ్రంథాలయంలో ఉన్న వివిధ రకాల పుస్తకాలను చదివి విజ్ఞానం పెంచుకోవా లన్నారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకూ ఉంటుందన్నారు. గ్రంథాలయంలో ఉచిత సభ్యత్వం ఇస్తున్నామని, కేవలం ఆధార్ కార్డు జిరాక్స్ ఇస్తే, రుసుమును దాతల ద్వారా సేకరిస్తామ న్నారు. ఈ అవకాశాన్ని పాఠకులు, నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రమణనాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందితో సమావేశం

సోమందేపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నరేంద్రకుమార్ అధ్యక్షతన మండలంలోని ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, రోజు కూలి రూ. 300 తక్కువ కాకుండా పని చేయించాలని, పని ప్రదేశంలో కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. అన్ని అంశాల్లో మండలాన్ని అత్యున్నత స్థానంలో నిలిచేలా పని చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో సోమశేఖర్‌రెడ్డి, ఈసీ అన్నపూర్ణ, ఉపాధి హామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా హరినాథ్

ముదిగుబ్బ : ఆర్యవైశ్య సంఘం మండల నూతన అధ్యక్షుడిగా అంబటి హరినాథ్‌గుప్తాను ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు ఆ సంఘం రాయలసీమ పొలిటికల్ చైర్మన్ వంకదారి వెంకటేశ్ బుధవారం తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జనార్ధన్‌గుప్తా, యువజన సంఘం అధ్యక్షుడిగా కృష్ణం మహేష్‌కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలిగా భాగ్యరేఖను ఎన్నుకున్నట్లు వివరించారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం బెంగళూరు జాతీయ రహదారిపై కొడికొండ చెక్ పోస్ట్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కొడికొండకు చెందిన సింహాద్రి(21) ఉద్యోగరీత్యా ఉదయాన్నే పనికి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింహాద్రి(ఫైల్‌ఫొటో)

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక బుక్కపట్నం రోడ్డులో వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయ సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా ఒ కారు ధ్వంసమైంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివ రాలు.. కొత్తచెరువుకు చెందిన టీచర్ రమణ కుమారుడు విశ్వకాంత్ ఉదయం తన ఇద్దరు చిన్నారులను ఇండికా కారులో ఎక్కించుకొని బుక్కపట్నం బయల్దేరాడు. ఈ క్రమంలో వేగంగా వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో కారు కాలువలో పడిపోయింది. విద్యుత్ మెయిన్ లైన్ తెగి కారు మీద పడింది. అయితే కారులో బెలూన్ తెరచుకోవడంతో కారు నడుపుతున్న విశ్వకాంత్‌కు స్వల్ప గాయాలు కాగా చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. కారు బాగా ధ్వంస మైంది. గమనించిన గ్రామస్తులు విశ్వకాంత్‌ను, చిన్నారులను వాహనంలో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ ఏఈ వెంకటేష్‌నాయక్, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేష్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

చెక్ బౌన్స్ కేసులో ఉపాధ్యాయురాలికి జైలు

ప్రజాశక్తి-హిందూపురం

చెక్‌బౌన్స్ కేసులో ఉపాధ్యాయురాలికి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ స్థానిక ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య బుధవారం తీర్పు చెప్పారు. లేపాక్షి మండలంలోని మైదుగోళంలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సత్యవతి రూ. 3లక్షల చెక్కును నేత్రావతి అనే మహిళకు వచ్చింది. అయితే బ్యాంకులో నిధులు లేని కారణంగా చెక్కు బౌన్స్ కావడంతో నేత్రావతి కోర్టులో కేసు దాఖలు చేసింది. సంబంధిత కేసు విచారణకు రాగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి రమణయ్య నిందితురాలు సత్యవతికి 3 నెలల జైలు శిక్షతో పాటు రూ. 3 లక్షలు వెంటనే చెల్లించాలని తీర్పు చెప్పారు. కాగా నిందితురాలు అప్పీలు వెళ్లే నిమిత్తం జడ్జి సస్పెన్షన్ ఆఫ్ సెంటెన్స్ కింద బెయిల్ మంజూరు చేశారు.